క్లుప్తంగా

చంద్రబాబు కేసుల విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలి


చెల్లెం ఆనందప్రకాష్

పాలకొల్లు అర్బన్: చంద్రబాబు అవినీతి కేసులు సత్వరమే విచారించేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మచ్చలేని నాయకుడు చంద్రబాబు అని తెలుగుదేశం నాయకులు ధర్నాలు, సభలు పెట్టి ప్రజల్ని నమ్మించడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. చంద్రబాబు అవినీతి కేసులో రిమాండ్ విధించిన ఏసీబీ కోర్టు జడ్జిని కూడా వదలకుండా అవమానకర రీతిలో టీడీపీ నేతలు ట్రోల్స్ చేస్తున్నారన్నారు. రిమాండ్ ఖైదీగా ఉన్న చంద్రబాబును బయటకు రప్పించేందుకు రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కల్పించేందుకు టీడీపీ నాయకులు కుట్రలు పన్నుతున్నారన్నారు. చంద్రబాబుపై ఇప్పటికే 9 పీటీ వారంట్‌లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. చంద్రబాబుపై ఉన్న అన్ని కేసులు త్వరగా విచారించే ప్రజలకు నిజానిజాలు తెలియజేయాలంటే సత్వరమే ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. చంద్రబాబు సీఎంగా పని చేసిన కాలంలో రాష్ట్ర సంపదను తన సామాజిక వర్గానికి దోచి పెట్టారని ఆనందప్రకాష్ విమర్శించారు. ఆ కారణంగానే చంద్రబాబును అరెస్ట్ చేసినా ప్రజల్లో ఏ మాత్రం సానుభూతి రాలేదన్నారు.

మార్టేరు రోటరీక్లబ్ సభ్యుల ప్రమాణ స్వీకారం

పెనుమంట్ర: మార్టేరు రోటరీ క్లబ్ పూర్వ వైభవాన్ని తీసుకువస్తానని మార్టేరు -1 ఎంపీటీసీ సభ్యుడు, రోటరీ క్లబ్ నూతన అధ్యక్షుడు గుడిమెట్ల లక్ష్మణరెడ్డి అన్నారు. ఆదివారం మార్టేరు రోటరీ క్లబ్ నూతన సభ్యుల ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మట్లాడుతూ గతంలో రోటరీక్లబ్ ద్వారా మార్టేరు పరిసర ప్రాంత ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామని, ఈ క్లబ్‌కు తిరిగి నూతన వైభవాన్ని తీసుకువస్తామన్నారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడిగా గుడిమెట్ల లక్ష్మణరెడ్డి, కార్యదర్శిగా చింతా ధర్మవేద నారాయణరెడ్డి, ట్రెజరర్‌గా బుట్టా రత్తయ్య ప్రమాణ స్వీకారం చేశారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

నరసాపురం రూరల్: నిరుపేదలు, ఆర్థికంగా ఇబ్బందులు పడే వారిని ఆదుకోవడంలో ముందుకు వచ్చిన ఆదర్శ ఆంధ్రాయూత్ కువైట్ సామాజిక సేవా సంఘం సేవలను పలువురు అభినందించారు. నరసాపురం మండలం ఎల్బీచర్ల గ్రామానికి చెందిన వ్యవసాయకూలీ సికిలే ప్రసాద్ తాటాకుల ఇళ్లు నెల రోజుల క్రితం అగ్నికి ఆహుతి అయ్యింది. దీంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ప్రసాద్ దీన స్థితి నేత జయసుధ ద్వారా తెలుసుకున్న ఆంధ్రాయూత్ కువైట్ సామాజిక సేవాసంస్థ సభ్యులు ఆదివారం ప్రసాద్ కుటుంబ సభ్యులను కలిసి రూ10వేల ఆర్థిక సాయాన్ని అందించారు. అదేవిధంగా రెండు కిడ్నీలు పాడైపోయి అనారోగ్యంతో బాధపడుతున్న వేములదీవికి చెందిన ముదాల సువర్ణరాజు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు అందించారు. కార్యక్రమంలో తాడి సహదేవ్, బోనం రాజు, మైలాబత్తుల శ్రీనివాస్, సంగాని బాబూరావు, వర్ధనపు నతానియేలు పాల్గొన్నారు.

జగనన్న కాలనీకి విద్యుత్ సదుపాయం

పెనుగొండ: మండలంలోని సోమరాజు చెరువులోని జగనన్న కాలనీకి ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫారమ్‌ను సర్పంచ్ దంపనబోయిన రూపవతి హరి ఆదివారం ప్రారంభించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు అండగా ఉంటూ ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని సర్పంచ్ రూపవతి కొనియాడారు. ప్రజల మద్దతు సీఎం జగన్‌కే ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు పెచ్చెట్టి లలిత, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దంపనబోయిన బాబూరావు, దంపనబోయిన బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్‌ధారణపై అవగాహన

పెనుమంట్ర: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం ద్వారా తమ ప్రాణాలకు రక్షణ కల్పించుకోవాలని పెనుమంట్ర ఎస్సై షేక్ మదీనా బాషా కోరారు. ఆదివారం బ్రాహ్మణచెర్వు సెంటర్‌లో ద్విచక్ర వాహనదారులను కొద్దిసేపు నిలిపి వారికి హెల్మెట్‌ధారణపై అవగాహన కల్పించారు.

ఘనంగా ప్రధాని మోదీ పుట్టినరోజు వేడుకలు

యలమంచిలి: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పుట్టినరోజుల్లో సందర్భంగా సేవా పక్షోత్సవాలలో భాగంగా శనివారం భారతీయ జనతా పార్టీ నాయకులు దొడ్డిపట్ల కేశవస్వామి, అబ్బిరాజుపాలెం వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. పాలకొల్లు అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ యర్రంశెట్టి పద్మారావు, దొంగ నరసింహకుమార్, వీరా జయరామాంజనేయులు (వీరాజీ), నామన శ్రీనివాస్, యర్రంశెట్టి కృష్ణభగవాన్ పాల్గొన్నారు.

పెనుగొండలో...

పెనుగొండ: భారత ప్రధాని నరేంద్ర మోదీ పుట్టిన సందర్భంగా ఆదివారం భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో ఆచంట, నడిపూడిల్లో దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. సేవా పక్షోత్సవాలు నిర్వహణలో భాగంగా నడిపూడిలోని వల్లీ దేవ సేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎం.సుబ్బారావు, దొడ్డిపట్ల నాగూరు, వంగూరి రామకృష్ణ పాల్గొన్నారు.

బొజ్జ గణపయ్యా.. చల్లగా చూడయ్యా..!

- గ్రామాల్లో వినాయక చవితి సందడి
- మార్కెట్‌కు పూజ సామగ్రి కొనుగోలు పోటెత్తిన ప్రజలు


పాలకొల్లు సెంట్రల్: కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న పాలకొల్లు మెయిన్ రోడ్డు


పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని ఓ షాపు వద్ద అమ్మకానికి మట్టి గణపతులు



పెనుగొండ: సిద్ధాంతంలో సిద్ధమైన లడ్డూ ప్రసాదాలు


పెనుగొండ: ఇంటి వద్ద పూలు కొంటున్న మహిళలు


పెనుగొండ: సిద్ధాంతంలో వినాయకుని అలంకరణ గొడుగులు

పెనుగొండ: ఆచంట నియోజకవర్గంలోని గ్రామాల్లో ఆదివారమే వినాయక చవితి సందడి నెలకొంది. సోమవారం నిర్వహించనున్న గణపతి నవరాత్రి ఉత్సవాలకు ఆచంట, పెనుగొండ, సిద్ధాంతం, వడలి గ్రామాల్లో చవితి పత్రి, మట్టి గణపతి ప్రతిమ, పూల అమ్మకాలు జోరుగా సాగాయి. ఉదయం నుంచి నెమ్మదిగా ఉన్నా సాయంత్రానికి దుకాణాలు అన్నీ కిక్కిరిసిపోయాయి. ధరలు అధికంగా ఉన్నా ప్రజలు కొనుగోలుకు ఆసక్తి చూపారు. చలువ పందిళ్లలో నిర్వహించే ఉత్సవ కమిటీలు ఈ ఏడాది తక్కువగానే ఉన్నా, వార్షికంగా నిర్వహించే పందిళ్లలో మాత్రం చిన్నచిన్న విగ్రహాలతో నిర్వహించడానికే సన్నద్ధమవుతున్నారు.

స్వీట్ల దుకాణాల్లో లడ్డూలు సిద్ధం

వినాయక చవితికి విశిష్టమైన లడ్డూ ప్రసాదాలు సిద్ధమయ్యాయి. స్వీట్ల దుకాణాల్లో 10 కేజీల నుంచి 135 కేజీల వరకూ లడ్డూలను చవితి నిర్వాహకుల ఆర్డర్లపై సిద్ధం చేశారు. తొమ్మిది రోజుల పాటు వీటిని పూజించి వేలం వేయడం ఆనవాయితీగా వస్తుంది. వీటిని వేలం పాటలో దక్కించుకోవడానికి భక్తులు పోటీ పడతారు. వేలం ద్వారా వచ్చే ఆదాయాన్ని చవితి నిర్వహణకు వినియోగిస్తుంటారు.

పాలకొల్లులో...

పాలకొల్లు సెంట్రల్: వినాయకచవితి సందర్భంగా పట్టణంలోని ప్రధాన రహదారిలో వ్యాపారస్తులతో సందడి వాతావరణం నెలకొంది. భక్తులతో ప్రతీ పూజకు మొదటి పూజలందుకునే గణనాయకుడి నవరాత్రులు సోమవారం నుండి అత్యంత వైభవంగా ప్రారంభంకానున్నాయి. భక్తులు, ఉత్సవ నిర్వాహక కమిటీల సభ్యుల ఆధ్వర్యంలో వాడవాడలా మండపాలను నెలకొల్పి ఉత్సవాలు ప్రారంభించడానికి సిద్ధం చేశారు. ఆదివారం పట్టణ ప్రధాన రహదారి జనంతో కిక్కిరిసిపోయింది. కోవిడ్ అనంతరం భక్తులు ఈ సంవత్సరమే పెద్దఎత్తున గణపతి ఉత్సవాలు ఉత్సాహంగా జరుపుకుంటున్నట్లు ఆనందంగా కనిపించారు. గతంలో ప్రతీ కూడళ్లలో గణపతి మండపాలు ఏర్పాటు చేసేవారు. కోవిడ్ అనంతరం పలు కూడళ్లలో మండపాలు ఏర్పాట్లు తగ్గించారు. మళ్లీ ఈ సంవత్సరం ప్రతీ కూడళ్లలో గణపతి మండపాలు ఏర్పాటు చేశారు. వినాయకచవితికి ఉత్సవ మండపాల్లో, ఇంటిలో ఏర్పాటుచేసుకునే పాలవల్లిల అలంకరణ కోసం ఏర్పాటు చేసుకోవడానికి పూజా సామగ్రిని వివిధ రకాల ఆకృతుల్లో తయారు చేసి విక్రయించారు. యునైటెడ్ కాపు వనిత సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రజలకు ఉచితంగా మట్టి గణపతులను పంపిణీ చేశారు.

నిబంధనలపై అవగాహన

వినాయకచవితి ఉత్సవాల నిర్వాహకులు మండపాల ఏర్పాట్లలో నిబంధనలు పాటించాలని పట్టణ సీఐ దారావత్తు రాంబాబు తెలిపారు. ఆదివారం పట్టణ పోలీస్‌స్టేషన్లో వినాయకచవితి మండపాల నిర్వాహకులతో అవగాహనా సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సీఐ రాంబాబు మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్లో ముందుగా అనుమతులు తీసుకోవాలన్నారు. ప్రతీ మండపానికి తప్పనిసరిగా నిర్వాహకుల్లో ఐదుగురు వ్యక్తుల ఫోన్ నెంబర్లు, గుర్తింపు కార్డు జిరాక్సులు ఇవ్వాలని పేర్కొన్నారు. ఉత్సవ ఏర్పాట్లు చేసే స్థలం ప్రైవేటు స్థలంలోనైతే ఆ స్థల యజమాని అనుమతి, ప్రభుత్వ స్థలమైతే మునిసిపల్ లేదా పంచాయతీ అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకుని ఉండాలని వివరించారు. విద్యుత్ శాఖ అధికారుల అనుమతులు వారి చూపించిన నిబంధనలు పాటించాలని వివరించారు. మండపాల్లో దీపాలు వెలిగించే సమయంలో జాగ్రత్తలు పాటించాలి. మైక్ సెట్ ఏర్పాటుచేసే సమయంలో ఉదయం 55, రాత్రి 45 డెసిబల్స్‌కు మించకుండా ఉండే విధంగా స్పీకర్లను ఉపయోగించాలని సూచించారు. మైక్‌సెట్స్ కూడా ఉదయం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకూ మాత్రమే ఉపయోగించాలి. మండపాల్లో భద్రత కోసం రాత్రి సమయంలో మండపాల్లో కమిటీ సభ్యులు ఎవరో ఒకరు కాపలా ఉండాలని సూచించారు. హుండీలు, విలువైన వస్తువులు రాత్రి సమయంలో మండపాల్లో ఉంచకూడదని వివరించారు. గణేష్ నిమజ్జనం చేసే సమయంలో చిన్నపిల్లలు కూడా రాకుండా చూసుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తగా చేసుకోవాలన్నారు. అనంతరం నిబంధనల పత్రాలను కమిటీల సభ్యులకు అందజేశారు.

నరసాపురంలో...

నరసాపురం రూరల్: వినాయకచవితిని ఘనంగా నిర్వహించేందుకు వాడవాడలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. కొప్పర్రు సెంటర్‌వద్ద ఉన్న వినాయకుని ఆలయం వద్ద నిర్వాహకులు పందిళ్లు వేయడంలో నిమగ్నమయ్యారు. సోమవారం వినాయకచవితి సందర్భంగా వినాయకుని ఆలయాల వద్ద, పలు సెంటర్లలో చలువపందిళ్లు, భారీ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. పలు కూడళ్లలో ఇప్పటికే వినాయకవిగ్రహాలు ప్రతిష్ఠించి పూజలు నిర్వహించేందుకు భారీ పందిళ్లను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో గ్రామాల్లో ఆదివారం నుండే వినాయకచవితి కళ సంతరించుకుంది. ప్రధానకూడళ్లలో పూలు, పండ్లు, పత్రి తదితర పూజా సామగ్రిని అమ్మే దుకాణాలు కళకళలాడాయి.


పెనుగొండ: పెనుగొండ సెంటర్‌లో పండ్లు, పొత్తుల అమ్మకాలు సాగిస్తున్న దృశ్యం


నరసాపురం రూరల్: కోవెల గుడి సమీపంలో ఆకట్టుకుంటున్న విద్యుత్ దీపాలంకరణ


పాలకొల్లు సెంట్రల్: ఉత్సవ కమిటీ సభ్యులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రాంబాబు

మట్టి గణపతే మహా గణపతి


నరసాపురం రూరల్: మట్టి గణపతి విగ్రహాలను అందజేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాల వినియోగం ఎంతగానో దోహద పడుతుందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు ప్రశంసించారు. నరసాపురం పట్టణంలో బస్టాండ్ సెంటర్ వద్ద ఆదరణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసాదరాజు మట్టి వినాయక ప్రతిమలను భక్తులకు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత దశాబ్ద కాలంగా మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తున్న ట్రస్టు నిర్వాహకుడు భగవాన్‌ను అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ, వైఎస్ కళాశాల డీన్ గంధం రామకృష్ణ, ఏయంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, మహిళాకళాశాల కార్యదర్శి నూలి శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని జైన్ దేవాలయం సమీపంలో కంచర్ల కాశీవిశ్వేశ్వరరావు, పుష్పదంపతులు 14 నదీ జలాలను కలిపి తయారు చేసిన మట్టి విగ్రహాలను ఉచితంగా భక్తులకు అందించారు. మెయిన్‌రోడ్డు రామాలయం వద్ద రోటరీక్లబ్ ఆధ్వర్యంలో వినాయక విగ్రహాలతో పాటు మొక్కలను కూడా పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షురాలు గన్నాబత్తుల సత్యవతి, ట్రెజరర్ బొమ్మిడి సూర్యకుమారి, బ్రహ్మాజీ, కోట్ల రామ్‌కుమార్, తోట శ్రీధర్ నాని, నాగు తదితరులు పాల్గొన్నారు.

మట్టి ప్రతిమలే మేలు

పాలకొల్లు అర్బన్: పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక ప్రతిమలతోనూ చవితి పూజ చేసుకోవాలని తిరుమల తిరుపతి పాలక మండలి సభ్యులు మేకా శేషుబాబు కోరారు. పూలపల్లి వైఎస్సార్ జంక్షన్ వద్ద మట్టి వినాయక ప్రతిమలను భక్తులకు శేషుబాబు ఉచితంగా పంపిణీ చేశారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో..

పాలకొల్లు అర్బన్: పర్యావరణ పరిరక్షణకు రోటరీ చేస్తున్న కృషి అభినందనీయమని పట్టణ సీఐ డి.రాంబాబు అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ పాలకొల్లు ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని గాంధీబొమ్మల సెంటర్‌లో 300 మందికి వినాయక మట్టిప్రతిమలు, వినాయక వ్రత కల్పం పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ యిమ్మిడి రాజేష్, కార్యదర్శి రావాడ సతీష్, మద్దాల వాసు, చందక రాము, ముత్యాల శ్రీనివాసరావు, కఠారి నాగేంద్రకుమార్, మద్దాల రాంప్రసాద్ పాల్గొన్నారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: మట్టి వినాయక విగ్రహాలను పూజిద్దాం, పర్యావరణాన్ని కాపాడుదాం అంటూ మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులతో మట్టి వినాయక విగ్రహాలను తయారీ ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శనలో పాల్గొని మట్టితో విగ్రహాలను సుందరంగా తీర్చిదిద్దిన ముగ్గురు విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఇంజినీర్ కె.మనోహర, జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి, యోగామాస్టర్ పడాల రామచంద్రారెడ్డి చిత్రలేఖన మాస్టర్ హర్షద్, భాణాల శ్రీనివాసరావు, బండి ప్రసాద్, కొత్త సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.


పాలకొల్లు అర్బన్ పూలపల్లి వైఎస్సార్ జంక్షన్ వద్ద మట్టి వినాయక ప్రతిమలు ఉచితంగా పంపిణీ చేస్తున్న టీటీడీ బోర్డు మెంబర్ మేకా శేషుబాబు


పెనుమంట్ర: బహుమతులు అందుకున్న విద్యార్థులతో మానవత సభ్యులు

వర్తకుల సమస్యల పరిష్కారానికి కృషి


పాలకొల్లు చేపల మార్కెట్‌ను సందర్శిస్తున్న గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

పాలకొల్లు అర్బన్: వర్తకుల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) మునిసిపల్ అధికారులకు సూచించారు. పట్టణంలోని బస్టాండ్ వద్ద ఉన్న చేపల మార్కెట్‌ను ఆదివారం గుడాల గోపి సందర్శించి వర్తకుల సమస్యలు తెలుసుకున్నారు. కోడి, చేపల వ్యర్థాలను మునిసిపాల్టీ చెత్త వాహనంలోనే వేయాలని సూచించారు. అలాగే మార్కెట్‌లో డ్రెయిన్ మరమ్మతులకు సంబంధించి రెండు రోజులు వర్తకుల మార్కెట్‌ను ఖాళీ చేస్తే పారిశుద్ధ్య సిబ్బంది డ్రెయిన్‌లో పేరుకుపోయిన సిల్ట్‌ను తొలగిస్తారని సూచించారు. సగంలో నిలిచిపోయిన షాపింగ్ కాంప్లెక్స్ పనులు జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి తక్షణం పూర్తి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటానన్నారు. అలాగే షాపింగ్ కాంప్లెక్స్ ముఖద్వారంలో నీరు నిలిచిపోవడంతో మార్కెట్‌లోకి వచ్చే వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని పలువురు వర్తకులు గోపి దృష్టికి తీసుకువచ్చారు. చేపలు విక్రయించుకునే చిల్లర వర్తకులు తమకు షెడ్డులేకపోవడం వలన ఇబ్బందులు పడుతున్నామని గోపికి వివరించారు. ఆయన స్పందించి గొడుగులు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, ఆలయాల చైర్మన్‌లు కోరాడ శ్రీనివాసరావు, జోగి వెంకటేశ్వరరావు, జేసీఎస్ జిల్లా కన్వీనర్ ఖండవల్లి వాసు, పట్టణ-2 జేసీఎస్ కన్వీనర్ మోర్త గిరీష్, వార్డు ఇన్‌చార్జ్ కొర్రగింజల శ్రీనివాసరావు, కొర్రగింజల హనుమంతరావు, గవర బుజ్జి, ఇజ్జాడ చినబాబు, కర్రా జయసరిత, ఉప్పె పండుబాబు, జోడాడ ఉమామహేశ్వరరావు, కెల్లా పెద్దిరాజు, పాలపర్తి కృపనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో చవితి వేడుకలు

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని యాళ్లవానిగరువులో గల వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం 10 గంటలకు వినాయక చవితి వేడుకలు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం పట్టణ, మండలాల్లో జరిగే వినాయక చవితి వేడుకల్లో ఆయన పాల్గొంటారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ వేడుకల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి


పెనుగొండలో విశ్వకర్మ జయంతి సందర్భంగా గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


పాలకొల్లులో విశ్వకర్మ జయంతి ఊరేగింపులో పాల్గొన్న సంఘ సభ్యులు

పెనుగొండ: విశ్వకర్మ జయంతి వేడుకలు పెనుగొండలోని కామాక్షీ దేవి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి ఆలయంలో పూజలు, అభిషేకంలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం కనుల పండువగా నిర్వహించారు. విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో సాయంత్రం వరకూ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించి, విశ్వకర్మ విశిష్టతను చాటి చెప్పారు. గ్రామోత్సవంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: స్థానిక వీరావారి వీధిలో కొలువై ఉన్న శ్రీ శ్రీచక్ర సమేత కంచి కామాక్షీదేవి, శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శ్రీ మద్విరాట్ విశ్వకర్మ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆలయంలో పాలకొల్లు పట్టణ, మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి ఉత్సవ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో పొన్నాడ మురళి, త్రిపురారి వెంకట సత్యనారాయణ, తాళాబత్తుల సిద్ధార్ధ, వీరమళ్ల వాసు, తమిరి చక్రధర్ దంపతులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం పట్టణ పురవీధుల్లో మంగళవాయిద్యాలతో విశ్వకర్మ చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు వింజరపు శంకరం, సెక్రటరీ గురజాపు శాస్త్రి, ట్రెజరర్ కర్రి మురళీకృష్ణ, సభ్యులు నాగులకొండ సదానందాచారి, గొన్నాబత్తుల సత్యనారాయణ, ముదపాక రాజా, కొసనా వెంకటేశ్వరరావు, తాళాబత్తుల వాసు, బండారు కోటేశ్వరరావు, పాలవలస స్వామి తదితరులు పాల్గొన్నారు.

టైలరింగ్ షాపు దగ్ధం

యలమంచిలి: కాజ పడమర గ్రామంలో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యకర్త పెచ్చెట్టి విష్ణుకు చెందిన టైలరింగ్ షాపునకు శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. షాపు ముందు ఉన్న సీసీ కెమెరాలను తస్కరించారు. అనంతరం షాపు షెట్టర్ కింద నుంచి పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు. దీంతో షట్టర్ వెనుక ఉన్న గ్లాస్ డోర్ పగలడంతోపాటు ఫ్లోరింగ్ మ్యాట్, కొన్ని దుస్తులు అంటుకుపోయాయి. షాపు మొత్తం పొగ కమ్మేయడంతో షాపులో ఉన్న బట్టలన్నీ పొగబట్టి నల్లబడ్డాయి. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) షాపు వద్దకు వెళ్లి బాధితుడు విష్ణుకు ధైర్యం చెప్పారు. కేసు విచారణకు వచ్చిన పోలీసులకు నిందితులను సాధ్యమైనంతా త్వరగా గుర్తించాలని చెప్పారు. ఇలాంటి సంఘటనలకు పాల్పడే దుండగులను క్షమించకూడదని గోపి హెచ్చరించారు. ఆయన వెంట కాజ పడమర, కాజ తూర్పు సర్పంచ్‌లు గుబ్బల వేణుగోపాలస్వామి, పాలంకి శ్రీనివాస్‌రావు వైఎస్సార్ సీపీ నాయకుడు బొక్కా సురేష్ ఉన్నారు.

70 ఏళ్ల చరిత్రలో అపూర్వ ఘట్టం

పెనుగొండ: 70 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా రాష్ట్రానికి చెందిన ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు ఐక్యరాజ్య సమితి వేదికగా న్యూయార్క్‌లో జరుగుతున్న ఎస్‌డీజీ యాక్షన్ వీకెండ్ సదస్సులో పాల్గొనడం అపూర్వ ఘట్టమని, రాష్ట్రానికి గర్వ కారణమని ఏపీ విద్య, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ కొవ్వూరి వేణుమాధవ రెడ్డి అన్నారు. ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ యూఎన్‌ఓ సదస్సులో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొనడం దేశ చరిత్రలోనే ఇది తొలిసారన్నారు. రాష్ట్రంలో విద్యార్థులను లీడర్లుగా చేసే లా విద్యా వ్యవస్థలో సంస్కరణలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని కొనియాడారు. ఏపీలో విద్యారంగంలో మార్పు మొదలైందన్నారు. నాడు నేడు పేరుతో తీర్చిదిద్ది కొత్త దనం తీసుకొచ్చారన్నారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటూ దేశంలోనే ఉత్తమ విద్యార్థులు నిలవాలన్నారు.